# ఆర్టీ సీ కార్మికుల సమ్మె

## బస్సు సర్వీసులు నిలిపివేత



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి** సత్తుపల్లి నియోజకవర్గంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బుధవారం ఉదయం నుంచి కొనసాగుతోంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే విధులను బహిష్కరించి డిపో ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెండింగ్లో ఉన్న 2021, 2025 పే స్కేల్ తక్షణమే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్టీసీలో కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నాలను నిలిపివేసి ట్రేడ్ యూనియన్లకు అనుమతి ఇచ్చి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమ్మె కారణంగా సత్తుపల్లి నుంచి విజయవాడ, ఖమ్మం, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆసుపత్రులకు వెళ్లాల్సిన రోగులు, పేద, మధ్యతరగతి ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమ్మె కొనసాగితే రవాణా సేవలు మరింత ప్రభావితం అయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆధునిక సాగు పద్ధతులతో మంచి ఫలితాలు

- మొక్కజొన్నలో అధిక దిగుబడి సాధించిన రైతు ఆనందు్క సన్మానం



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ఆధునిక సాగు పద్ధతులతో మంచి ఫలితాలు సాధించవచ్చని సర్పంచ్ గరిగే కల్పనా కృష్ణమూర్తి అన్నారు. హన్మకొండ జిల్లా దామెర మండల కేంద్రానికి చెందిన రైతు దామెర ఆనంద్ మొక్కజొన్న పంటలో ఎకరానికి 40 నుంచి 45 క్వింటాళ్ల అధిక దిగుబడి సాధించి ఆదర్శ రైతుగా నిలిచారు. అధిక దిగుబడి సాధించినందుకు ఆయనను నవభారతి కంపెనీకి చెందిన యయాతి సీడ్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సాగు పద్ధతులు అనుసరించి అధిక దిగుబడి సాధించిన ఆనంద్ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తిని రాజు, వార్డ్ సభ్యుడు నక్క రాజేందర్, మాజీ డైరెక్టర్ వి.వీరస్వామి, ఫీల్డ్ ఆఫీసర్లు ఉమ్మడి కుమార్, మెరుగు సంతోష్, ఉమ్మడి రజినీకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి బోరంచు సన్మానం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని గోండు గూడెంలో నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మంత్రి జూపల్లిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ ఇంచార్జ్ ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేంసూర్ ఏఎస్సైకు ఉత్తమ సేవా పథకం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్ మండల పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు ఉత్తమ సేవా పథకం పురస్కారం లభించింది. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం టేకులపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం భద్రాద్రి



కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా నాగేశ్వరరావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారం అందుకున్న నాగేశ్వరరావును వేంసూర్ ఎస్సై కవితతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేశ్వరరావు కర్తవ్యనిష్ఠతో పనిచేస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.

# మారుమూల ప్రాంత విద్యార్థులు జిల్లా కు గర్వకారణం





- జిల్లా కలెక్టర్ హరిత
- ఇంటర్ టాపర్ల కు కలెక్టర్ ఘన సన్మానం
- ప్రభుత్వ కళాశాలల ఫలితాలపై హర్షం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా గర్వ కారణంగా నిలిచారని జిల్లా కలెక్టర్ హరిత కొనియాడారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో, జిల్లా మాధ్యమిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా టాపర్ల సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి రాందాస్‌తో కలిసి కలెక్టర్ విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారిని స్వయంగా అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధ్యాపకుల నిరంతర కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే జిల్లా కు రాష్ట్ర స్థాయిలో ఈ గౌరవం లభించిందని ప్రశంసించారు. ముఖ్యంగా మారుమూల మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు దీటుగా మార్కులు సాధించి సత్తా చాటడం జిల్లా యంత్రాంగానికి ఎంతో గర్వకారణమన్నారు. జైనూర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన బైపిసి విద్యార్థిని 967 మార్కులు, ఎంపిసి విద్యార్థి అఖిల్ సాయి వరప్రసాద్ 984 మార్కులు, బైపిసి ఉర్దూ మీడియం విద్యార్థిని శాభిన 881 మార్కులు, దాహేగాం కళాశాల సిఈసి విద్యార్థి ఎల్కరి సంతోష్ 936 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

మొత్తం 15 మంది జిల్లా టాపర్లను సత్కరించిన కలెక్టర్, భవిష్యత్తులో వీరంతా ఉన్నత లక్ష్యాలను చేరుకుని జిల్లా కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంచేలా ఫలితాలు సాధించినందుకు అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ పిలుపునిచ్చారు. కెరమేరి మండలంలోని గోయగాం గ్రామంలో ఈనెల 29న నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ, రాష్ట్రీయ అశోక్ పూలే అంబేద్కర్ ఫెస్టివల్ గోడ పత్రికలను బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతీయులకు అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని కొనియాడారు. ఈనెల 29వ తేదీన బుధవారం సాయంత్రం గోయెగాం గ్రామంలో నిర్వహించే రాష్ట్రీయ అశోక్ పులే అంబేద్కర్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రజలంతా కలిసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నగ్రారే తారు, ఉపాధ్యక్షుడు టీ దత్తు, ప్రధాన కార్యదర్శి ఎం శంకర్, కోశాధికారి టి ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం వదిలారు.. ఆదర్శంగా నిలిచారు







## సావర్ కేడ గ్రామంపై కలెక్టర్ హర్షం

**ఉద్యమ కెరటం, కెరమెరి :** మద్యపానం వంటి సామాజిక రుగ్మతలకు దూరంగా ఉంటూ, జిల్లాకే ఆదర్శంగా నిలిచిన సావర్ కేడ గ్రామ ప్రజల నిర్ణయం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత కొనియాడారు. బుధవారం కెరమెరి మండలం సావర్ కేడ గ్రామంలోని ప్రధానమంత్రి శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన 'గ్రాడ్యుయేషన్ డే' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ

### సావర్ కేడ - ఒక ఆదర్శ గ్రామం

గ్రామస్తులందరూ ఏకతాటిపై నిలిచి మద్యపానానికి దూరం కావడం గొప్ప విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. క్రమశిక్షణ, సామాజిక స్పృహ కలిగిన ఈ గ్రామం ISO (ఐఎస్ఓ) సర్టిఫికెట్ పొందడానికి అన్ని రకాల అర్హతలను కలిగి ఉందని ఆమె అభివర్ణించారు. పాఠశాల ఉపాధ్యాయుల అంకితభావాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేస్తే, సావర్ కేడ స్ఫూర్తితో మరిన్ని ఆదర్శ పాఠశాలలు తయారవుతాయని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మారుస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీ సీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్ , వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు , బాలకృష్ణ, సలం బీన్ అహ్మద్, మాజీ ఎ ఎం సి, సింగల్ విండో చైర్మన్ గంధం శ్రీనివాస్, అలీ బీన్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నీసార్ , దూడల అశోక్ లతో కలిసి ఆర్టీసీ కార్మికులు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్ష శిబిరానికి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూన్న ప్రభుత్వం ఆర్టీ సీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కార్మికులు చేపడుతున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

# పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం

- జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- అట్టహాసంగా ప్రారంభమైన 'రివర్స్ టూరిజం'

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాధారణంగా నగరవాసులు ప్రకృతి ప్రాంతాలను సందర్శిస్తుండగా, ఈ కార్యక్రమం ద్వారా అడవి ప్రాంతాల ఆదివాసీలు నగర నాగరికతను, చారిత్రక కట్టడాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని గోండు గూడెంలో నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం మంత్రి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీలకు నగర జీవన విధానంపై అవగాహన కల్పించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బయటి ప్రపంచాన్ని చూడటం ద్వారా అడవి బిడ్డల ఆలోచనా విధానంలో మార్పు రావడంతో పాటు ముఖ్యంగా విద్యార్థుల్లో ఉన్నత విద్య పై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 250 మంది ఆదివాసీలు ఐదు ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్కు బయల్దేరారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న ఈ బృందానికి తారామతి బారాదరి వద్ద పర్యాటక శాఖ అధికారులు ఘన స్వాగతం పలకనున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రముఖ ప్రదేశాలను వారు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, ఆత్రం సక్కు, సోయం బాపురావు తదితరులు పాల్గొన్నారు.






# రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం

- సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతలకుంట గ్రామంలో కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ పనులను మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్తో కలిసి పరిశీలించారు. ప్రాజెక్ట్ పురోగతిని ప్రత్యక్షంగా వీక్షించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ పూర్తయితే రైతులకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయానికి భారీగా లాభం చేకూరుతుందని, అభివృద్ధి పనులు ప్రజల అవసరాలకు అనుగుణంగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రిహాన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ కోటేశ్వరి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్ల గుళ్లనరసింహారావు, ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహనీయుల ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

- డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటు రామచంద్ర నాయక్

**ఉద్యమ కెరటం, మహబూబాబాద్:** మహనీయుల ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటు రామచంద్ర నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని చిన్న గూడూరు మండలం గుండు రాజుపల్లి గ్రామంలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ పాపారాయుడు, మాట తప్పని విలువిద్యాకారుడు ఏకలవ్య విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు రాయపురం సాంబయ్య, ఏకలవ్య నాయకులు జిల్లా ఇన్చార్జి కట్ట పాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కేతురు ఉపేందర్, జిల్లా చైర్మన్ మొగిలి నాగన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బేరం బక్కయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగం మల్లయ్య, సహాయ కార్యదర్శి పాలకొండ రవి, యూత్ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి సర్పంచ్ కోట ఎల్లేష్, స్థానిక ఏకలవ్య నాయకులు నల్లగొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





# కేజీబీవీ విద్యార్థు లు శాస్త్రవేత్తలుగా ఎదగాలి






జిల్లా కలెక్టర్ రాజర్షిషా


**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో ఆదిలాబాద్ అర్బన్, గ్రామీణ (బంగారిగూడ) కేజీబీవీ పాఠశాలల్లో అత్యాధునిక 'ఖగోళ, అంతరిక్ష ప్రయోగశాలలను' జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం ప్రారంభించారు. యుఎస్పి ఇండియా సీఎస్ఆర్ నిధులు, టీడీఎఫ్, నవార్స్ ఎడ్యుటెక్ సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ విద్యార్థులు కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక విద్యపై దృష్టి సారించాలని, వినూత్న ఆలోచనలతో వచ్చే వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పట్టణ కేజీబీవీలో గ్రంథాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్, పాఠశాల ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్ట ర్ ఖుష్బూ గుప్తా, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, యుఎస్పి ఇండియా ప్రతినిధి డాక్టర్ మృణాల్ జైవంత్, టీడీఎఫ్ ప్రతినిధులు రాజేశ్వర్ రెడ్డి, వినిల్ రెడ్డి, నవార్స్ ఎడ్యుటెక్ ప్రతినిధులు శశాంక కూన, అరుణ్, తహసీల్దార్లు శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగులు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పేదల జీవితాల్లో ఇందిరమ్మ ఇండ్లు వెలుగులు నింపుతున్నాయని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని కోర్టికల్(బి) గ్రామంలో లబ్ధిదారుల కోరిక మేరకు నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్ తో కలిసి ఈ వేడుకల్లో పాల్గొ ని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజంగా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కొనియాడారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే గొప్ప లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు అవుతోందని అన్నారు. ఇది సామాన్య ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐపీఈ ఫలితాల్లో మెరిసిన విద్యార్థి నికి కలెక్టర్ సన్మానం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** ఐపీఈ మార్చి–2026 పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో అత్యుత్తమంగా 946 మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల తిర్యాణి ఎంపీసీ విద్యార్థిని ఆర్.రిషిర్వా నాగరాజును కుమురంభీం జిల్లా కలెక్ట ర్ హరిత ప్రత్యేక సన్మానం చేశారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరిత విద్యార్థిని అభినందిస్తూ మెమొంటో అందజేశారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొని ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని అభినందించారు.

# ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం రాజీవ్నగర్ గ్రామ పంచాయతీకి చెందిన ఉపిరే ప్రణీత్(25) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు సింగరేణి సంస్థలో కాసిపేట రెండో గనిలో ట్రామర్గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో రెండో షిఫ్ట్ విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ప్రణీత్ ఇంట్లో కాలకృత్యాలు ముగించుకుని తన బెడ్రూమ్లోకి వెళ్లాడు. కొంతసేపటి తర్వాత గదిలో టీవీ నడుస్తుండటంతో తండ్రి కిషన్ అనుమానం వచ్చి గది తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్కు ఉరి వేసుకుని కనిపించాడు. చికిత్స నిమిత్తం వెంటనే స్థానికుల సహాయంతో ప్రణీత్ను బెల్ల ంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలు లేవని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు తాండూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లో క్లోరిన్ లీకైపై మాక్ డ్రిల్





**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్లో క్లోరిన్ వాయువు లీక్ జరిగే పరిస్థితుల్లోతీసుకోవాల్సిన చర్యలపై బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కలెక్టర్ కె.హరిత పర్యవేక్షణలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో ఈ మాక్ డ్రిల్తో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీఎం ఉద్యోగులకు క్లోరిన్ గ్యాస్ లీక్ జరిగినప్పుడు ఎలా స్పందించాలి, ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సిబ్బందికి సేఫ్టీపై అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ ఏకె మిశ్రా మాట్లాడుతూ సంస్థలో సేఫ్టీ మేనేజ్మెంట్కు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ ఆర్.శ్రీనివాస్, జీఎంలు ఎం.అనిల్ కుమార్, ఎంఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ శివారులోని సర్వే నం.8, తాండూర్ గ్రామపంచాయతీ శివారులోని సర్వే నం.699 లోని ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కిష్టంపేట గ్రామపంచాయతీకి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో భూమిని చదును చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంగళవారం రాత్రి సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న ఆదేశాల మేరకు తాండూర్–1 ఆర్ఐ బొలిశెట్టి పద్మజ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ భూమి వద్దకు వెళ్లి "ఇది ప్రభుత్వ భూమి– ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడును"అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ పద్మజ మాట్లాడుతూ ఇదే స్థలంలో గతంలో కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కొందరు వాటిని తొలగించి భూమిని మళ్లీ చదును చేసినట్లు తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంసీ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే



**ఉద్యమ కెరటం, తాండూర్:** పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తాండూర్ మండలం కిష్టంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ స్వరూప మాట్లాడుతూ చిన్నపిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వకూడదని సూచించారు. మొబైల్ ఫోన్ల వినియోగంతో పిల్లల ఆరోగ్యం, చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిష్టంపేట సర్పంచ్ సార్ల తిరుపతి, ఉప సర్పంచ్ హనుమండ్ల విక్రమ్, ఐసీడీఎస్ మాదారం సెక్టార్ సూపర్వైజర్ రమాదేవి, పంచాయతీ సెక్రటరీ ఉదయ్ రాంప్రసాద్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఫీజు దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

- **వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్**




**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు విమర్శించారు. బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏఐఎఫ్డీఎస్, ఏఐఎస్బీ, పీడీఎస్యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్బీ రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్, పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సేవా దృక్పథం ముసుగులో విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రైవేట్ విద్యాసంస్థల్లోఫీజుల దోపిడీని అరికడతామని ప్రకటించినప్పటికీ అది అమలులో కనిపించడంలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీఎఫ్ఆర్సీ సూచనల మేరకు మాత్రమే ఫీజులు నిర్ణయించాల్సి ఉన్నప్పటికీ, అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రతియేటా 5 నుంచి 10 శాతం వరకు ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయని విమర్శించారు. అడ్మిషన్, పుస్తకాలు, డెవలప్మెంట్, ల్యాబ్, లైబ్రరీ, గేమ్స్, ఐఐటీ, నీట్, ఐఏఎస్ కోచింగ్ వంటి పేర్లతో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. అంతేకాకుండా ఉపాధ్యాయులకు పీఎఫ్, ఈపీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా లేబర్ చట్టాలను కూడా ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. విద్య హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ చాలా విద్యాసంస్థలు ఆ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించి, నిబంధనలు ఉల్లంఘించే సంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బి.వంశీకృష్ణ, బి.బాలకృష్ణ, శ్రీపతి వినయ్, రామ్ చరణ్, బొజ్జ జ్యోతి, రోహిత్, సతీష్, నాగరాజు, డానియల్, శ్రీకాంత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో వెనకడుగు లేదు

- **పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం**



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఇచ్చిన హామీల అమలులో వెనకడుగు లేదని, పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేర్చుతుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గ జేందర్ అన్నారు. మండలంలోని సీతాగొంది గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. గత పదేళ్ల లో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి పేదల సొంతింటి కలను నెరవేర్చుతోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడం ద్వారా తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. అలాగే ఏడాదికి ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సాయం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేయడంలో పోటీ పడుతున్నాయని, ఆ పార్టీలను నమ్మితే ప్రజలు మళ్లీ నష్టపోతారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, 'ఇందిరమ్మ రాజ్యం'ను మళ్లీ తీసుకువచ్చామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఉయిక అనసూయ, ఆసిఫ్, గంగారాం, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, సద్దాం, విష్ణు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదివాసీ బిడ్డల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **ప్రారంభమైన 'ఆదివాసీ టూరిజం ఎక్స్పోజర్'యాత్ర**
- **జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదివాసీ బిడ్డల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివాసీ బిడ్డల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్పోజర్' కార్యక్రమాన్ని బుధవారం ఉట్నూర్ మండలంలోని గోండుగుడా గ్రామంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈనెల 22 నుంచి 26 వరకు జరిగే ఈ విజ్ఞాన యాత్రలో మూడు విడతలుగా ఆదివాసీలు హైదరాబాద్ను సందర్శించనున్నారని తెలిపారు. ప్రతి బ్యాచ్లో 200 నుంచి 250 మంది చొప్పున వెళ్లేలా పర్యాటక శాఖ ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. తొలి విడతలో 250 మంది ఆదివాసీల కోసం ఐదు ప్రత్యేక ఏసీ బస్సులను సిద్ధం చేయగా, తొలి బ్యాచ్ను హైదరాబాద్కు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ ఐదు రోజుల పర్యటనలో ఆదివాసీలు హైదరాబాద్లోని అంతర్జాతీయ విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబిని పార్క్, శిల్పారామం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారని తెలిపారు. మారుమూల అడవుల్లో నివసించే ఆదివాసీ యువతకు ఈ పర్యటన ఒక మంచి అనుభవంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాత్రలో పాల్గొనే వారికి బస, భోజన వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తన విక్రేతలపై ఉక్కుపాదం




జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్ఫోర్స్ బృందాలు, విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా ప్రత్యేక టాస్క్ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. అనుమతి లేని విత్తనాల విక్రయం, గడువు ముగిసిన ఎరువుల నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాంటి డీలర్ల లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. విత్తన, ఎరువుల డీలర్లు ప్రతి విక్రయానికి రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, దుకాణాల వద్ద స్టాక్ వివరాలు ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్కు ముందే గ్రామాల్లో అవసరమైన విత్తనాలు, ఎరువుల లభ్యతపై వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే నకిలీ విత్తనాలను గుర్తించే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విత్తన, ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మాట్లాడిన కలెక్టర్ డిమాండ్కు అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉంచాలని, ధరల నియంత్రణను పాటించాలని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, టాస్క్ఫోర్స్ సభ్యులు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జనగణన పకడ్బందీగా నిర్వహించాలి





### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జనగణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం చెన్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణనపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మండల తహశీల్దార్ మల్లికార్జున్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్ట ర్ మాట్లాడుతూ జనగణనలో భాగంగా మే 11 నుంచి చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని ఖచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో గుర్తించిన ఇండ్ల జాబితా, బ్లాక్ వివరాలు అందజేస్తామని చెప్పారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం వేళల్లో గణన ప్రక్రియ నిర్వహించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఇండ్ల గణనకు ముందు సంబంధిత గృహ యజమానులకు సమాచారం అందిస్తే సమయానికి అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమయపాలన పాటించి ఎలాంటి పొరపాట్లు లేకుండా గణన చేపట్టాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్న శిక్షణలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎన్నికల నిర్వహణ కూడా జనగణన ఆధారంగానే ఉంటాయని చెప్పారు. అనంతరం మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. చెన్నూర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, వంద పడకల ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే కేజీబీవీలో నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, భోజనశాల, వంటశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంపీఎస్ఓ ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ ట్రైనర్లు సురేందర్, గోపికృష్ణ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సిరికొండలో చలివేంద్రం ప్రారంభం

**ఉద్యమ కెరటం, సిరికొండ:** ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు సిరికొండ గ్రామ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మండల తహశీల్దార్ తుకారాం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో సర్పంచ్ దత్తాత్రి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ బొడ్డు దత్తాత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల రాజు, కొండాపూర్ సర్పంచ్ పట్టేపు లక్ష్మణ్, ఉప సర్పంచ్ బాదు పటేల్, కుంటాగూడ సర్పంచ్ భీంరావ్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ షేక్ ఇమామ్, మండల అధ్యక్షులు ఇమామ్, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్, షేక్ అలాం, రషీద్, ముదిరాజ్ యువత జిల్లా అధ్యక్షులు కంచం లక్ష్మణ్, అబ్బు హుస్సేన్, పంచాయతీ సెక్రటరీ సూర్యప్రకాష్, మిషన్ భగీరథ ఏఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలుకు పూర్తి ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ తదితరులతో కలిసి కొనుగోలు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాల ద్వారా నిర్ణీత మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, టేబుల్, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్ అందుబాటులో ఉండాలని తెలిపారు. జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోనె సంచుల వివరాలు, ధాన్యం రవాణా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాల వారీగా సమాచారం అందించాలని చెప్పారు. అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలైన పప్పు ధాన్యాలు, కూరగాయల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** గిరిజన యువత ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ (ఇండస్ట్రియల్) శాఖ ద్వారా మంజూరైన సబ్సిడీ వాహనాన్ని బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో లబ్ధిదారునికి అందజేశారు. బోథ్ మండలంలోని పిప్పల్ ధరి గ్రామానికి చెందిన కుమ్రం యాదవ్ రావుకు ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా 40 శాతం సబ్సిడీతో మహీంద్రా బొలెరో వాహనం మంజూరైంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మారుతి సుజుకి షోరూమ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చైర్మన్ మల్యాల అంజయ్యలతో కలిసి ఆడే గజేందర్ వాహనాన్ని ప్రారంభించి లబ్ధిదారునికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలు గిరిజన యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం లింగంపల్లి చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.గంగన్న, పట్ల గోవర్ధన్, నడికుంట ఆశన్న, బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం, మౌలానా తదితరులు పాల్గొన్నారు.



## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### రిమ్స్ అభివృద్ధి పై ప్రజాప్రతినిధుల సమీక్ష



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొని ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు మున్సిపల్ సేవలను నిరంతరం పర్యవేక్షిస్తామని మున్సిపల్ చైర్పర్సన్ తెలిపారు. రిమ్స్ ఆసుపత్రిని జిల్లా ప్రజలకు మరింత చేరువ చేసేలా, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, ఇతర వైద్య అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వెంచర్ దరఖాస్తులపై నిబంధనల ప్రకారం చర్యలు

### జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి భూమిని పట్టణ ప్రణాళిక అధికారి సంపత్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వెంచర్లకు సంబంధించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. కలెక్ట ర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## రిమ్స్లో నాణ్యమైన వైద్యం అందించాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు కోరారు. బుధవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ను ఆయన కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలను మెరుగుపర్చాలని కోరారు. ఆసుపత్రిలో అర్హులైన నిరుద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవినీతికి పాల్పడే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ఆర్టిఏ మెంబర్ దూడ రాజేశ్వర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చైర్మన్ మల్యాల అంజయ్య, నాయకులు బిక్కి గంగన్న, మేకల జితేందర్, భాస్కర్, నడుకుంటి ఆశన్న, కోడి ప్రభాకర్, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

